

ఒండ్రు మట్టితో భూసారం

వేసవి కాలం రావడంతో.. ఇప్పటికే వరి కోసిన రైతులు చెరువుల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. 10లో▸



నీటిని సంరక్షిద్దాం

నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడమే వాటర్ షెడ్ పథకం లక్ష్యమని డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. 10లో▸



మలేరియాను తరిమేద్దాం

మలేరియాను తరిమేద్దామని డిప్యూటీ డీఎంహెచ్ఓ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

చీమల్‌దరిని ఆదర్శంగా తీసుకోవాలి

బీహార్, కేంద్ర బృందం



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న బీహార్ సర్పంచుల బృందం

మోమిన్‌పేట: జాతీయ అవార్డు పొందిన చీమల్‌దరి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీహార్, కేంద్ర బృందం సభ్యులు కితాబిచ్చారు. శుక్రవారం గ్రామంలో బీహార్‌కు చెందిన సర్పంచులు, కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, రోడ్లు, భూగర్భ మురుగు కాల్వల నిర్మాణం, ప్రజలకు పంచాయతీ నుంచి అందుతున్న సేవలు, పన్నుల వసూలు, వీధి దీపాల నిర్వహణను పరిశీలించారు. మారుమూల గ్రామం ఇంతగా అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్థుల సహకారం, పంచాయతీ పాలకవర్గం పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే బీఎంఆర్



రాట్నం తిప్పుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: భారత్ సమ్మిట్‌లో కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా శుక్రవారం భారత్ సమ్మిట్ (2025) కార్యక్రమం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమ్మిట్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి రాట్నం ఆడించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు

పరిగి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెంకటయ్య సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పరిగి తోపాటు ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమ కాటు వల్ల మలేరియా వ్యాపిస్తుందన్నారు. దోమలను నిర్మూలించేందుకు పరిసరాల శుభ్రతతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' వాయిదా

అనంతగిరి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భూ భారతి రైతు అవగాహన సదస్సులు జరుగుతున్నందున ఈ నెల 28న జరగాల్సిన ప్రజావాణిని వాయిదా వేశామని తెలిపారు. మే నెల నుంచి యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

సీల్ టెండర్ల ఆహ్వానం

అనంతగిరి: జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకానికి రిజిస్ట్రేషన్ అయిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నుంచి సీల్ టెండర్లు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల ఫారాలు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం నుంచి మే 6వ తేదీ లోపు పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల ఏజెన్సీలు ఏప్రిల్ 28 నుంచి మే 6వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు సీల్ టెండర్లు సమర్పించాలని సూచించారు. మే 6వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అందుబాటులో ఉన్న ఏజెన్సీల సమక్షంలో టెండర్లను తెరవడం జరుగుతుందని తెలిపారు. టెండర్ ఫారాలు, ఇతర సమాచారం కోసం జిల్లా ఉపాధి కల్పనాధికారిని సెల్ నంబర్ 91776 07016లో సంప్రదించాలని సూచించారు.

కారెనుక.. కారుగట్టి

రేపు ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ

- గ్రేటర్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ
- ఒక్కో నియోజకవర్గం నుంచి 5 వేల మంది
- 1,200 బస్సులు సహా 1,500కు పైగా కార్లు సిద్ధం
- సమన్వయం చేస్తున్న పార్టీ ప్రధాన నేతలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా : వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు గ్రేటర్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ చేయాలని పార్టీ నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 5 వేల మందిని తరలించాలని తీర్మానించింది. ఆ మేరకు ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు 1,200 బస్సులు సహా మరో 1,500కుపైగా కార్లను కేటాయించింది. పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతను మాజీ మంత్రులు మహ్మద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, చామకూర మల్లారెడ్డి, హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు అప్పగించింది. ఇప్పటికే వీరంతా ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేసి, మున్సిపాలిటీ, కార్పొరేషన్, మండలం, గ్రామ పంచాయతీల వారీగా బస్సులను, కార్లు, ఇతర వాహనాలను కేటాయించారు. 'ఇంటికో జెండా.. ఊరికో బస్సు' చొప్పున కేవలం గ్రేటర్ జిల్లాల నుంచే లక్ష మందిని తరలించాలని నిర్ణయించారు.

పురుషులనే ఎక్కువగా తరలించాలని..

భగ్గున మండుతున్న ఎండల నేపథ్యంలో మహిళలు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పురుషులనే ఎక్కువగా తరలించాలని భావిస్తున్నారు. ఆ మేరకు కార్యకర్తలను, అభిమానులను సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం, క్యాంపు ఆఫీసుల నుంచి ర్యాలీగా బయలుదేరనున్నారు. ఎవరికీ వారు ఆయా సమీప మార్గాల నుంచి ఔటర్ మీదుగా ఘట్‌కేసర్ జంక్షన్‌కు చేరుకోనున్నారు. అటు నుంచి భారీ ర్యాలీగా వరంగల్ బయలుదేరనున్నారు. సభకు వచ్చే ముఖ్య నాయకులు, కార్యకర్తలకు మంచినీరు, భోజన వసతి కల్పించనున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు టూరిస్ట్ బస్సులతో పాటు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలకు సంబంధించిన ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల బస్సులను ఇందుకు కేటాయించారు.

25 ఏళ్లు.. అనేక ఆటుపోట్లు

1969 తెలంగాణ తొలి దశ ఉద్యమం తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండాగా 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) ఏర్పడింది. కేసీఆర్ సహా ఆచార్య జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆలే నరేంద్ర, గాదె ఇన్నయ్య తదితరులు మలిదశ తెలంగాణ ఉద్యమానికి అంకురార్పణ చేశారు. ఆ తర్వాత 2003 ఏప్రిల్ 27న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ వేదికగా 'తెలంగాణ గర్జన' పేరుతో ద్వితీయ వార్షికోత్సవ సభను నిర్వహించారు. 2001 నుంచి 2014 వరకు టీఆర్‌ఎస్ (ఇప్పుడు బీఆర్‌ఎస్) అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. అప్పటి వరకు ఒక్క సికింద్రాబాద్ (పద్మారావు గౌడ్) మినహా గ్రేటర్‌లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఆ సమయంలో తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంది. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల పోరు గర్జనతో చివరకు కేంద్రం దిగొచ్చింది. డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణ ప్రకటన చేసింది. కొందరి అభ్యంతరాలతో డిసెంబర్ 23న కేంద్రం మళ్లీ వెనక్కి తగ్గింది. 2011 మార్చి 10న ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్, ఆ తర్వాత సకల జనుల సమ్మె, ఉద్యోగుల సహాయ నిరాకరణ వంటి వరుస ఆందోళనలతో చివరకు కేంద్రం దిగొచ్చింది.

గ్రేటర్‌లో అనేక అభివృద్ధి పనులు

2014 ఫిబ్రవరిలో తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది, జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అప్పటివరకు గ్రేటర్ జిల్లాల్లో పార్టీకి పెద్దగా బలం లేదు. 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీడీపీ, కాంగ్రెస్ నుంచి భారీగా పార్టీలోకి వలసలు పెరిగాయి. మెజారిటీ ఎమ్మెల్యే సీట్లు సహా గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 2018 నాటికి పార్టీ మరింత బలపడింది. పదేళ్లు అధికారంలో ఉంది. గ్రేటర్‌లో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికల్లో ఎల్బీనగర్, మహేశ్వరం, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో గెలుపొందింది. రూరల్ జిల్లాలతో పోలిస్తే.. గ్రేటర్ జిల్లాల్లోనే పార్టీకి అత్యధిక సీట్లు వచ్చాయి. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి, భారీగా నిధుల కేటాయింపుల పేరుతో రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. ముఖ్య నేతలు పార్టీ మారినా.. కేడర్ మాత్రం కేసీఆర్ నాయకత్వాన్నే నమ్ముకుని పని చేస్తోంది.



పరిగి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

❖ నిరసన గళం

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల ముస్లింలు భారీ ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిగి, బంట్వారం, యాలాల, దోమ మండల కేంద్రాల్లో భారీ ర్యాలీలు తీశారు. – వికారాబాద్

నీటి సమస్య రావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశం

అనంతగిరి: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతింటే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బోర్ల నుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం ఉంటే బోరు మోటార్లు కొనుగోలు చేయాలని సూచించారు. బోర్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మించాలన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, సీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవి, చల్మారెడ్డి, డీఈలు పాల్గొన్నారు.



విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

'గృహజ్యోతి'లో చేతివాటం తగదు

- సీపీఎం నాయకుల ఆందోళన
- బిల్లులు ఎక్కువ చేసి ఇస్తున్నారని ఆరోపణ
- ఏడీ కార్యాలయం ఎదుట నిరసన

తాండూరు టౌన్: గృహజ్యోతి పథకం సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తాండూరులోని ఏడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకం కింద పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, విద్యుత్ సిబ్బంది అధిక రీడింగ్ చూపించి, బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంటికి కొత్త మీటర్ పెట్టాలంటే రూ.8 వేలు చెల్లించాలని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్లకు జీరోబిల్లు ఇవ్వాల్సిన విద్యుత్ సిబ్బంది, అధిక రీడింగ్ తీసి బిల్లు చెల్లించమనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గృహజ్యోతి పథకం సక్రమంగా కొనసాగేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, సతీష్, మల్కయ్య, బాలస్వామి, సంజీవ్, శిలాస్, ఎల్లయ్య, ఉదయ్, అంజయ్య, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇది సర్కారు వారి భూమి

- కొనుగోలుదారులకు నోటీసులు అందజేసిన రెవెన్యూ అధికారులు



ధారూరులోని ప్రభుత్వ భూమిలో బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

ధారూరు: పేదలకు పంచిన సీలింగ్ భూములను ఎవరు కొనుగోలు చేసినా ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని తహసీల్దార్ సాజిదాబేగం అన్నారు. సీలింగ్, అసైన్డ్ భూములను ఎవరు కొనుగోలు చేసినా చెల్లదని, ఎవరైనా తమకు ఫిర్యాదు చేస్తే సదు భూములను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశాట. మండల కేంద్రంలోని 197/4, 197/5 సర్వే నంబర్లలోని 4.08 ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్ ఆదేశం మేరకు శుక్రవారం ఆర్ఐ స్వప్న, అసిస్టెంట్ ఆర్ఐ అంజలి, సర్వేయర్ శ్రీహరి సదరు భూములను పరిశీలించారు. ఇందులో ప్రభుత భూమి అంటూ బోర్డు పాతారు.

ఏం జరిగిందంటే..

ధారూరుకు చెందిన పత్తి అమృతమ్మకు, చాకలి శంకరయ్యకు ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ కింద 2.04 ఎకరాల చొప్పున భూమిని పంపిణీ చేసింది. వీరి నుంచి అవుసుపల్లి లక్ష్మి సెప్టెంబర్, 0226లో 2.04 ఎకరాలు, శెట్టి లలితాదేవి నవంబర్ 2, 2008లో 2.04 ఎకరాలు కొనుగోలు చేశారు. అయితే తనకు, తమ పిల్లకు తెలియకుండానే తన భర్త శంకరయ్య సీలింగ్ భూమిని విక్రయించారని, దీన్ని తిరిగి ఇప్పించాలని ఇటీవల భూమి విక్రేత కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు పీఓటీ చట్టం 1977 కింద కొనుగోలుదారులకు నోటీసులు జారీ చేశారు.

హత్య చేసి, నిప్పంటించి..

- రాజాపూర్‌లో దారుణం
- మహిళను హత్యచేసిన ప్రియుడు



వెంకటమ్మ (ఫైల్)

ధారూరు: భార్యాపిల్లలను వదిలేసి మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఓ వ్యక్తి ఆమెను హత్య చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాజాపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ అనిత, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మ్యాతరి బాబయ్య అడ్డాకూలీగా జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిసైన ఆయన తరచూ భార్య అనంతమ్మను వేధించేవాడు. దీంతో విసుగు చెందిన ఆమె నాలుగేళ్ల క్రితం తన నలుగురు ఆడపిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అడ్డా కూలీ అయిన బాబయ్య పనులకు వచ్చే మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకునేవాడు. ఈక్రమంలో దోమ మండలం రాకొండకు చెందిన బండి వెంకటమ్మ(47)తో పరిచయం ఏర్పడింది. రెండు నెలల క్రితం ఆమెను ఇంటికి తెచ్చుకున్న బాబయ్య.. వెంకటమ్మతో కలిసి గ్రామంలోనే ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఏమైందో ఏమో కానీ గురువారం రాత్రి వెంకటమ్మను హత్య చేసి, ఆమె శవాన్ని గోనె సంచిలో కుక్కాడు. పక్కనే ఉన్న పాడుబడ్డ ఇంట్లోకి తీసుకెళ్లి శవంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటలను గమనించి గ్రామస్తులు రావడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. హతురాలి కొడుకు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మంటల్లో కాలుతున్న వెంకటమ్మ మృతదేహం

అన్నింటా 'ఆదర్శమే'

- కార్పొరేట్‌కు దీటుగా బోధన
- ఆంగ్ల మాధ్యమం, కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఈ లెర్నింగ్, స్కాలర్ షిప్, మౌలిక సదుపాయాల కల్పన
- రేపే ప్రవేశ పరీక్ష
- సద్వినియోగం చేసుకోవాలంటున్న ప్రిన్సిపాల్ కృష్ణకుమార్



నవాబుపేట ఆదర్శ పాఠశాల

నవాబుపేట: పిల్లల బంగారు భవిష్యత్తే తల్లిదండ్రుల లక్ష్యం. ఇందుకోసం నిరంతరం శ్రమిస్తుంటారు. రోజురోజుకూ ఆంగ్ల మాధ్యమానికి ఆదరణ పెరుగుతుండటంతో ఆ దిశగా చదివించాలని ఆశపడుతుంటారు. ఇందుకు చక్కటి వేదికగా నిలుస్తోంది నవాబుపేటలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల. ఇక్కడ నిరుపేదల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోంది. అన్ని సదుపాయాలు కలిస్తూ ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తున్నారు. ఉచిత విద్య తోపాటు పక్కా భవనాలు, ల్యాబ్, లైబ్రరీ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశిస్తే ఇంటర్ వరకు అక్కడే చదువుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల 27న ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంట్రెస్ టెస్ట్ నిర్వహించనున్నారు.

చదువులో రాణిస్తున్న విద్యార్థులు

నవాబుపేట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు బాగా చదువుకొని ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో సీటు పొందేందకు ఎక్కువ మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. 2013లో స్కూల్ ప్రారంభం కాగా ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 447 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంటర్ చదువుతున్న బాలికలకు హాస్టల్ వసతి ఉంది. ప్రస్తుతం 100 మంది విద్యార్థునులు వసతి గృహంలో ఉంటున్నారు.

కల్పిస్తున్న వసతులు

నవాబుపేట ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులకు అనేక వసతులు కల్పిస్తున్నారు. విశాలమైన తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యం, ఉచిత పుస్తకాలు, దుస్తులు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, మధ్యాహ్న భోజనం, ప్రత్యేక తరగతులు, కాస్మోటిక్ కిట్లు, ఎన్‌సీసీ శిక్షణ, ఎంసెట్, ఎన్ఐటీ, పోలీస్ శిక్షణ తదితర కోచింగ్ ఇస్తున్నారు.

రేపే ప్రవేశ పరీక్ష

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 27న పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

ఉత్తీర్ణతలో మేటి

పాఠశాల ప్రారంభం నుంచే పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ సారి ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో నికితకు 470 మార్కులకు గాను 456 మార్కులు వచ్చాయి. బైపీసీలో తేజశ్రీకి 440లకు 413 మార్కులు, సీఈసీలో పల్లవికి 500కు గాను 370 మార్కులు వచ్చాయి. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో అనూషాకు 1000 మార్కులకు గాను 913 మార్కులు, బైపీసీలో పవిత్రకు 1000కి 932 మార్కులు, సీఈసీలో నవ్యకు 1000కి 864 మార్కులు వచ్చాయి.

- ఇంటర్ మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- ఇక్కడ ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో 8మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.
- పలువురు ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు.
- వాయిద్య విభాగంలో 10వ తరగతి చదివిన ఓ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.
- భరతనాట్యం, కూచిపూడి, సైన్స్‌ఫెయిర్ పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.
- మరికొంత మంది జిల్లా స్థాయిలో రాణించారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం



ఇక్కడ చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. అంతేకాకుండా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థులు కూడా కష్టపడి చదువుతున్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కృష్ణకుమార్, ప్రిన్సిపాల్, నవాబుపేట ఆదర్శ పాఠశాల

క్లుప్తంగా

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి



విద్యుత్ సిబ్బంది నరికేసిన చెట్లు

నవాబుపేట: తన పంక్షన్ హాల్ ఎదుట ఉన్న చెట్లను నరికి వేసిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, లింగంపల్లికి చెందిన రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తాము పదిహేనేళ్ల క్రితం ఫంక్షన్ హాల్ వద్దను మొక్కలు నాటామని, ప్రస్తుతం అవి భారీ వృక్షాలుగా ఎదిగాయని తెలిపారు. ఐదేళ్ల క్రితం వీటి కింద స్తంభాలు పాతిన విద్యుత్ శాఖ అధికారులు, వైర్లకు తాకుతున్నాయనే కారణంతో నరికేశారని తెలిపారు. కొమ్మలు కొట్టాల్సిన చోట మొదళ్ల వరకు నరికేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

బషీరాబాద్: మండలంలోని గొట్టిగఖుర్దులో పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించాడని ఒకరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 24న గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే వ్యక్తి పంచాయతీ కార్యాలయానికి వచ్చి తన విధులకు ఆటంకం కలిగించారని కార్యదర్శి హేమావేణు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో కేసు నమోదు చేసిన ఎస్ఐ శంకర్ విచారణ నిమిత్తం వెంకటరెడ్డిని శుక్రవారం స్టేషన్‌కు పిలిచారు. ఇదిలా ఉండగా.. తాను ఇల్లు కట్టుకునేందుకు సెల్లార్ ఇసుక వచ్చిందని ఆడిగానని, ఇందుకోసం డబ్బులు అడగగా ఇవ్వకపోవడంతోనే తనపై కార్యదర్శి కేసు పెట్టించారని సదరు వ్యక్తి ఆరోపించారు.

నీటిని పొదుపుగా వాడుదాం



ప్రతిజ్ఞ చేస్తున్న రేగడిమైలారంవాసులు

బొంరాస్‌పేట: 'నీరే జీవనాధారం.. నీటిని పొదుపుగా వాడుతాం.. నీటిని కలుషితం కానివ్వం' అంటూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతిజ్ఞలు చేస్తున్నారు. శుక్రవారం గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలు నీటి ప్రాముఖ్యతను వివరిస్తూ చైతన్యం చేస్తున్నారు. నీటి వృథా, కాలుష్యం, వనరుల పరిరక్షణ, తాగునీటి సమస్యలు వంటి అంశాలపై చర్చిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రతిజ్ఞలు చేస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తలెత్తే సమస్యలను సైతం వివరిస్తున్నారు. ఇందులో అంగన్‌వాడీలు,ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది,గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

ఎస్‌బీఐ మేనేజర్ యమున శ్రీవల్లి



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

పూడూరు: ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ పూడూరు మేనేజర్ యమున శ్రీవల్లి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఆవరణలో ఖాతాదారులకు బ్యాంకింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులకు తెలపవద్దని, ఫోన్‌లు వచ్చినా స్పందించరాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కొణిజేటి బృందంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేషపటేల్, నాయకులు సుభాష్‌రెడ్డి, అశోక్, గోపాలనాయక్, జంగయ్య, రాజుకృష్ణ, గౌస్, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

శంకర్‌పల్లి: ఓ కార్మికుడు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన మడకామి(23) బతుకుదెరువుకు వలస వచ్చాడు. ఆయనకు భార్య, కొడుకు ఉన్నారు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన కేఎంఎల్ కన్‌స్ట్రక్షన్ లో గురువారం 8వ అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారు పరిస్థితి విషమంగా ఉందని చెప్పి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లమని సూచించారు. ఈ క్రమంలో ఆయన మార్గమధ్యలోనే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఒండ్రు మట్టితో భూసారం

- పొలాలకు తరలించే పనుల్లో రైతులు బిజీ
- చెరువుల్లో పూడిక తీసిన మట్టిని తీసుకెళ్లేందుకు ఆసక్తి



వ్యవసాయం పొలంలో వేసిన నల్ల మట్టిని పరుస్తున్న రైతు

దౌల్తాబాద్: వేసవి కాలం రావడంతో.. ఇప్పటికే వరి కోసిన రైతులు చెరువుల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. వచ్చే నెల రోజుల్లో వానాకాలం పంటల సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో భూములను సారవంతం చేసుకునే పనిలో ఉన్నారు. ప్రస్తుత వ్యవసాయం రసాయన ఎరువుల మయమైంది. దీంతో సాగు భూములు నిస్సారమైపోతున్నాయి. ఈక్రమంలో ఒండ్రు మట్టి తరలింపు నేలకు బలం చేకూరుస్తుందని కర్షకులు భావిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలిస్తున్నారు. ప్రస్తుతం సాగు పనులు లేకపోవడంతో మట్టి తరలింపులో నిమగ్నమయ్యారు. భూగర్భ జలాలు అడుగంటి మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెరువు పూడికతీత పనులు చేపట్టారు. ఆ మట్టిని రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు తరలిస్తున్నారు. దూరప్రాంతంలో పొలాలు ఉన్నవారికి ఖర్చు ఎక్కువ అవుతున్నా నల్లమట్టి తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పోషకాలు మెండు

చెరువు మట్టిలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. నల్లమట్టిలో సేంద్రియ కర్బనం, సూక్ష్మ పోషకాలు మెండుగా ఉండడంతో మొక్కలు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటాయి. రసాయన ఎరువుల వాడకంతో పాటు పెట్టుబడి సైతం తగ్గుతుంది. దీనికి తోడు దిగుబడులు పెరుగుతాయి. అందుకే రైతులు ఎక్కువ శాతం చెరువుల్లోకి పూడిక మట్టిని తరలిస్తున్నారు.

పంట దిగుబడి పెరిగింది



గత యాసంగి సీజన్‌లో రెండు ఎకరాల్లో చెరువు మట్టిని తోలాను. దీంతో యూరియా, పురుగు మందుల వాడకం తగ్గింది. గతంతో పోలిస్తే ఈసారి పది బస్తాల దిగుబడి పెరిగింది. ప్రస్తుతం కూడా చెరువులోని పూడిక మట్టిని తోలిస్తా.

– బాల్‌రాజు, రైతు, దౌల్తాబాద్

భూసారం వృద్ధి చెందుతుంది



చెరువు మట్టిలో సేంద్రియ కర్బనాలు, సూక్ష్మ పోషకాలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఇసుక, దుబ్బ నేలల్లోనూ నల్లమట్టి పోస్తే మంచి పంటలు పండించవచ్చు. ఇందులో తేమ శాతం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. పంట ముగిసే వరకూ ఎరువుల పనిచేస్తుంది.

– లావణ్య, ఏఓ





ఇంటిపై గులాబీ జెండా ఎగరేసేందుకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

గోడపై పోస్టర్ అతికిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు

బీఆర్‌ఎస్ రజతోత్సవ సందడి

తాండూరు టౌన్: వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేందుకు గులాబీ శ్రేణులు సిద్ధమయ్యారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పిలుపు మేరకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లపై గులాబీ జెండాలు ఎగరేశారు. వందలాది వాహనాల్లో సభకు తరలి వెళ్లాలంటూ పట్టణంలోని వార్డు వార్డుకు పోస్టర్లు అంటించారు.

రజతోత్సవ సభకు తరలిరండి

బీఆర్‌ఎస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్



అనంతగిరి: వరంగల్‌లో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్‌ఎస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్ పేర్కొన్నారు. సభకు మున్సిపల్ పరిధిలోని వార్డుల నుంచి వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే సభకు రాష్ట్రం నలుమూలల నుంచి గులాబీ దండు కదిలిందన్నారు. ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు సభకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఒక పండుగ వాతావరణంలో ఈ సభ జరుగనుందన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి సభను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వెంకటయ్య



దోమ: బీఆర్‌ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో మాజీ సీఎం కేసీఆర్ వరంగల్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి నేరుగా అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, ఈ నెల 27న నిర్వహించబోయే రజతోత్సవ సభకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వరంగల్‌కు తరలిరావాలి

బీఆర్‌ఎస్ వికారాబాద్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి



అనంతగిరి: వరంగల్‌లో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు తరలిరావాలని పార్టీ వికారాబాద్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి మహిపాల్‌రెడ్డి కోరారు. ఉద్యమ పార్టీగా అవతరించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచిన ఘనత అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వికారాబాద్ ప్రత్యేక జిల్లాగా చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. నేటికీ ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. వరంగల్ సభలో కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. కావున మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పెద్దఎత్తున తరలివెళ్లాలని సూచించారు.

ప్రజల భద్రతే పోలీసుల కర్తవ్యం

ఎస్పీ నారాయణరెడ్డి



పరిగి బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు

అనంతగిరి: ప్రజల భద్రతే పోలీసుల కర్తవ్యమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి, తాండూరు పట్టణాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. రద్దీ ప్రాంతాలైన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో అనుమానాస్పద వస్తువులు, బ్యాగులను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా ప్రజల సహకారంతో నేర రహిత సమాజాన్ని నిర్మిస్తామని తెలిపారు.

డోజర్ తగిలి వ్యక్తి మృతి



మృతుడు అజయ్‌మోతిలాల్

పూడూరు: డోజర్ వాహనం తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జాపూర్ రెవెన్యూ పరిధిలో రుద్రమైన్స్ పేరిట మైనింగ్ నిర్వహిస్తున్నారు. మైనింగ్ ప్రాంతంలో లారీలను తవ్వేందుకు మహారాష్ట్ర నుంచి ట్రాలీ వాహనంలో డోజర్‌ను తెప్పించారు. ట్రాలీ నుంచి కిందికి దించుతున్న క్రమంలో డోజర్ తగిలి కర్ణాటక రాష్ట్రం బసవన్న బేగేవాడికి చెందిన అజయ్ మోతిలాల్ జాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దోపిడీ దొంగలకు రిమాండ్

నవాబుపేట: అమాయక ప్రజలను చూసి కారులో లిఫ్ట్ ఇస్తామని నమ్మించి, దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మీనపల్లికలాన్‌కు చెందిన శీలపురం మహేశ్వరి గతేడాది ఆగస్టు 2న తన తల్లి కాంతమ్మ, కూతురుతో కలసి అమ్మగారి (మోమిన్‌పేట మండలం కేసారం) ఇంటి నుంచి అత్తగారి మీనపల్లికలాన్‌కు బయలుదేరింది. మధ్యలో గేట్‌వనంపల్లి గేటు వద్ద ఆటో కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో ఎర్టిగా కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు (మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు చెందిన సూరజ్ సందానకాలే, సోలాపూర్‌కు చెందిన మచింద్రదిలాసేకర్, తన్సిస్‌లాకపటనేకర్, నవిరాజ్ వినయ్‌కుమార్) వీరి వద్ద ఆపారు. మేము సైతం మీ ఊరి మీదుగానే వెళ్తున్నాం.. దింపేస్తాం రండి అంటూ కారులో ఎక్కించుకున్నారు. కొద్దిదూరం వెళ్లాకనే మహేశ్వరి మెడలోని మూడు తులాల బంగారు చైన్ లాక్కుని మీనపల్లికలాన్ సమీపంలో దింపి వెళ్లిపోయారు. ఈ విషయమై బాధితులు అప్పట్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు కారు నంబర్ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు పరిగి, మోమిన్‌పేట మండలాల్లో సైతం ఈతరహా దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దోచుకున్న నగలను పలు చోట్ల అమ్ముకున్నట్లు నిందితులు ఒప్పుకొన్నారని ఎస్ఐ అరుణ్‌కుమార్ వెల్లడించారు. వీరితో పాటు వ్యాపారులపైనా కేసులు నమోదు చేసి బంగారం, నగలను రికవరీ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు బైకులు ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలిలో గాయపడిన దస్తయ్య

దోమ: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ వసంత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగన్‌పల్లి గ్రామానికి చెందిన దస్తయ్య(40) తన బైక్‌పై రంగారెడ్డిపల్లి నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో దిర్సంపల్లికి చెందిన చంద్రకాంత్ శ్రీనివాస్, గొల్ల రమేశ్ మరో బైక్‌పై పాలేపల్లి నుంచి వస్తున్నారు. ఈ క్రమంలో రెండు బైకులు పాలేపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో దస్తయ్యను వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలతో చికిత్స తీసుకుంటున్నారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

నీటిని సంరక్షిద్దాం

- డీఆర్‌డీఓ శ్రీనివాస్

అనంతగిరి: నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడమే వాటర్ షెడ్ పథకం లక్ష్యమని డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామంలో వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపు నీటిని సంరక్షించి భూగర్భజలాలను పెంచడమే వాటర్ షెడ్ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామంలో వాటర్ షెడ్ పథకం కింద చేపట్టిన పలు పనులను ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాల వారికి సురక్షిత నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మొక్కలు నాటడం, ఇంకుడు గుంతల తవ్వడం ద్వారా భూమిలోకి నీటిని ఇంకింపే పద్ధతిని అలవాటు చేసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నీటి సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఓ జయసుధ, గ్రౌండ్ వాటర్ ఏడీ రవి, ఎంపీడీఓ డ్వాక్రా జయ కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సతీష్ రెడ్డి, ఏపీఎం లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు మాధవరెడ్డి, శివయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు అనసూయ ప్రభాకర్, మండల ఏపీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చెరనుంచి విముక్తి



కబ్జా నుంచి స్వాధీనం చేసుకొంటున్న రెవెన్యూ అధికారులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఎన్కతల చిన్న చెరువును కబ్జా చెర నుంచి విముక్తి చేశామని ఆర్ఐ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆక్రమణకు గురైన 1.20 ఎకరాల చెరువు భూమిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఐఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో వినీత్, వివేక్ అనే ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారంటూ గ్రామస్తులు చేసిన ఫిర్యాదుతో అధికారులు స్పందించారు. ఈ మేరకు రెవెన్యూ, నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి శుక్రవారం హద్దులు నిర్ధారించారు. ప్రభుత్వ భూములను చెరబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోవర్ధన్, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

29న టీఆర్‌జేకేఎస్ సర్వసభ్య సమావేశం

బొంరాస్‌పేట: తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం(టీఆర్‌జేకేఎస్) హైదరాబాద్‌లో ఈనెల 29న రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సంఘం ప్రగతి నివేదిక, కార్యాచరణ ప్రణాళిక, జానపద కళాకారులకు ఉపాధి, ప్రభుత్వ సౌకర్యాలు తదితర అంశాలు చర్చిస్తామన్నారు. సమావేశానికి ఆసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కేవీ రమణాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్యలు హాజరవుతున్నారని చెప్పారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ గఫార్

బంట్వారం: కోట్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన ఐంటెన్ వెంకట్ అక్టోబర్ 13, 2024లో తన రెడ్‌మీ ఏ–3 ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఫోన్‌ను పట్టుకుని, శుక్రవారం ఎస్ఐ అబ్దుల్ గఫార్ చేతుల మీదుగా బాధితునికి అప్పగించారు.

మహనీయుల బాట ఆదర్శం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మదన్‌పల్లిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ పార్టీ గడప గడపకు జాతీయభావం పంచుతుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మదన్‌పల్లిలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, గోడపత్రికను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని కులాలు, అన్ని మతాలు సమానంగా చూస్తుందన్నారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, నాయకులు నర్సింలుగౌడ్, ప్రశాంత్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి తదితరులున్నారు.

మలేరియాను తరిమేద్దాం



కొడంగల్: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్

కొడంగల్: మలేరియా మహమ్మారిని తరిమేద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మలేరియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రయాదవ్ మాట్లాడుతూ.. మలేరియా రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముందస్తు జాగ్రత్తతోనే వ్యాధి నివారణ సాధ్యమన్నారు. దోమలతోనే మలేరియా వ్యాపిస్తుందన్నారు. కార్యక్రమంలో కొడంగల్ సబ్ యూనిట్ ఆఫీసర్ పకీరప్ప, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యం, డాక్టర్ బుష్రా ఫాతిమా, రఫీ, మధుసూదన్‌రెడ్డి, సుజీల తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కుల్కచర్ల: మలేరియా వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత స్వచ్ఛతను పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, మెడికల్ అసిస్టెంట్ వెంకట్, అంజూ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయం

కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూరు టౌన్: పరీక్షల్లో విజయం సాధించాలంటే ఆత్మవిశ్వాసం ఎంతో ప్రధానమైనదని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. హిందూ ధార్మిక పరిషత్, సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌సెట్ ఉచిత శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక భావ్యం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ.. పట్టుదల, కృషి, ఏకాగ్రతతో విద్యనభ్యసిస్తే విజయం సొంతమవుతుందని తెలిపారు. ఉన్నత చదువులు చదివి, ఉత్తమస్థాయి స్థాయికి ఎదగాలని బాలికలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు తీసుకున్న శిక్షణతో అందరూ మెరుగైన ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన కాలిఫోర్నియా డిగ్రీ కళాశాల యాజమాన్య కమిటీ సభ్యులు కల్వ రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఆర్థిక స్థితి సరిగా లేని పేద విద్యార్థులకు ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్, సేవాభారతి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పరిషత్ కోకన్వీనర్లు వేణుగోపాల్‌రెడ్డి, నరేందర్, ట్రస్టీలు ఓంప్రకాష్ సోమానీ, పటేల్ విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.